సాక్షి చిత్తూరు

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



పెద్ద కొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం పెద్దకొట్టాయి ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు జరిపించారు.



శేష వాహనంపై కరకంఠేశ్వరుడు

నగరి : కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలో పంగుణోత్తర కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని శేష వాహనంపై ఊరేగించారు. ధర్మకర్త సుబ్రమణ్యం పాల్గొన్నారు.



శనేశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కలశ పూజలు, తర్వాత స్వామి వారికి తైలాభిషేకం, అభిషేకాలు నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం(సా)	సహర్ సోమవారం(ఉ)
తిరుపతి	6.28	4.48
చిత్తూరు	6.30	4.47
పుంగనూరు	6.31	4.51

న్యూస్‌రీల్

నిధుల దుర్వినియోగం.. రికవరీకి ఆదేశం



సామాజిక తనిఖీలో అధికారులు

బంగారుపాళెం: మండలంలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి దుర్వినియోగమైన రూ.1,48,500ల రికవరీకి ఆదేశించినట్లు డ్వామా పీడీ గంగాభవానీ తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై 16వ విడత సామాజిక తనిఖీ కింద ప్రజావేదిక నిర్వహించారు. 2021–22 ఆర్థికసంవత్సరంలో చేసిన పనులపై క్షేత్రస్థాయిలో చేపట్టిన తనిఖీల్లో సిబ్బంది నిధులు దుర్వినియోగం చేసినట్లు గుర్తించామన్నారు. దీంతో సొమ్మును రికవరీ చేయడంతోపాటు అక్రమాలకు పాల్పడిన సిబ్బందికి రూ.6,450 జరిమానా విధించినట్లు వివరించారు. సమావేశంలో విజిలెన్స్ అధికారి బాగ్యలక్ష్మి, క్లస్టర్ ఏపీడీ వరప్రసాద్, ఎంపీపీ అమరావతి, ఎంపీడీఓ హరిప్రసాద్, ఎస్‌టీఎం లోకేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఆర్ అచ్యుత్‌రామ్, పీఆర్‌ఏఈ గురవారెడ్డి, ఏపీఎం కిరణ్, ఈసీ గణేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒంటిపూట బడి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో సోమవారం నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒంటిపూట బడులపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే పాఠశాల నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ విద్యాసంవత్సరం చివరి పనిదినం వరకు ఒంటిపూట బడులు అమలులో ఉంటాయన్నారు. వేసవి నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పూర్తిరోజు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రేపటి నుంచి ఈ నెల 18వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు జరుగుతున్నందున, పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం పైన తరగతులు నిర్వహించుకోవాలని తెలిపారు.

బోయకొండలో ప్రసాద విక్రయ కేంద్రాలు



ప్రసాద విక్రయ కేంద్రంలో తొలి టికెట్ కొనుగోలు చేస్తున్న పెద్దిరెడ్డి తదితరులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో నూతనంగా నిర్మించిన ఏడు ప్రసాద విక్రయ కేంద్రాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో బోయకొండను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. భక్తులకు మెరుగైన వసతులు కల కల్పించడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఈఓ చంద్రమౌళి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, లడ్డూ రమణ, రాయల మోహన్, సోమల మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.



చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం వేచి చూస్తున్న గర్భిణులు

- చిత్తూరులోని సంతపేటకు చెందిన అనిత అనే గర్భిణి.. ప్రసవం కోసం బుధవారం రాత్రి జిల్లా ఆస్పత్రికి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు కాన్పు కష్టమని బిడ్డ అడ్డం తిరిగిందని చేతులెత్తేశారు. దీంతో గర్భిణి కుటుంబసభ్యులు వెంటనే వేలూరు సీఎంసీలో అడ్మిట్ చేశారు. అక్కడ సుఖ ప్రసవమైంది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. కాన్పు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యసిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు అనిత కుటుంబీకులు తెలియజేశారు.
- రెండు నెలల క్రితం చిత్తూరుకు చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం జిల్లా ఆస్పత్రిలో చేరింది. వివిధ పరీక్షలు చేసిన వైద్యులు రెండు రోజుల పాటు ఆమెను పర్యవేక్షణలో ఉంచారు. ఆపై నొప్పులు రావడంతో మేం చేయలేమని, తిరుపతికి తీసుకెళ్లామని సూచించారు.అక్కడ డాక్టర్లు ఆపరేషన్ చేసి బిడ్డను తీశారు. పుట్టిన కొన్ని గంటల సమయంలోనే శిశువు మృతి చెందింది. జిల్లా ఆస్పత్రి వైద్యులు సకాలంలో చికిత్స అందించకపోవడం వల్లే బిడ్డ కన్నుమూసిందని బాధితులు ఆరోపిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

ఇలా జిల్లా ఆస్పత్రిలో రోజూ పలు కేసులు వస్తున్నాయి. కలెక్టర్‌కు సైతం ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆయన వీటిపై స్పందించారు. విచారణకు ఓ కమిటీని నియమించారు.

ప్రసవ వేదన



ప్రజారోగ్య రక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపడుతోంది. ఆస్పత్రులకు అత్యాధునిక పరికరాలను అందజేస్తోంది. అత్యుత్తమంగా మౌలిక వసతులు కల్పిస్తోంది. పేదలకు నాణ్యమైన చికిత్సలందించాలని స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ కొందరు వైద్యసిబ్బంది అలసత్వం కారణంగా మహోన్నత ఆశయం నీరుగారిపోతోంది. నిరుపేద గర్భిణులను నిర్లక్ష్యం వెంటాడుతోంది. ఇందుకు చిత్తూరులోని జిల్లా ఆస్పత్రి డాక్టర్ల వైఖరే నిదర్శనంగా మారింది. కాన్పు కోసం వచ్చిన వారిని సక్రమంగా పరీక్షించకుండానే వేరే హాస్పిటళ్లకు రెఫర్ చేసేస్తున్నారు. అత్యవసర పరిస్థితులను సైతం అర్థం చేసుకోకుండా మావల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు సైతం తూతూమంత్రంగా మందలించి తప్పుకుంటున్నారు.

- గర్భిణులకు కాన్పు కష్టాలు
- రెఫర్ పేరుతో తరిమేస్తున్న వైద్యులు
- అత్యవసర పరిస్థితుల్లోనూ అదే నిర్లక్ష్యం
- సిబ్బంది తీరుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

చిత్తూరు రూరల్ : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి విభాగం ఉంది. ఇక్కడకు రోజూ 20 నుంచి 35 వరకు ప్రసవ కేసులు వస్తుంటాయి. ఒక్క చిత్తూరు ప్రాంతం వారే కాకుండా కుప్పం, వెదురుకుప్పం, ఎస్‌ఆర్‌పురం, నగరి, తిరుత్తణి, వేలూరు, కాట్పాడి, పరదరామి, బెంగళూరు నుంచి కూడా పెద్దసంఖ్యలో కాన్పుల కోసం ఈ ఆస్పత్రిని ఆశ్రయిస్తుంటారు. దీంతో ప్రభుత్వం సైతం అవసరాలకు తగ్గట్టు పరికరాలు, మందులు, వసతులను కల్పించింది. డాక్టర్లు, సిబ్బందిని కూడా పూర్తి స్థాయిలో నియమించింది. అపోలో హాస్పిటల్ తరఫున కూడా వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఈ ఆస్పత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం తాండవిస్తోంది. ఇక్కడి సిబ్బంది ప్రసవం కోసం వచ్చే వారితో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే వెంటనే వేరే ఆస్పత్రికి రెఫర్ అంటూ రోడ్డున పడేస్తున్నారు. దీంతో చేసేది లేక కొందరు కొద్దోగొప్పో కాసులు ముట్టజెప్పి ప్రసవం చేయించుకుంటున్నారు. మరి కొందరు తప్పని పరిస్థితులో తిరుపతిలోని స్విమ్స్, రుయా, వేలూరు సీఎంసీకి వెళ్లిపోతున్నారు. మిగిలిన వాళ్లు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి కడుపు కోతలు తెచ్చుకుంటున్నారు.



చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

భయపెట్టి తరిమేస్తున్నారు!

అత్యవసర ప్రవసం కోసం వస్తే ఆస్పత్రిలో నరకం అనుభవిస్తున్నామని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట, పండగ సమయాలు, డ్యూటీ డాక్టర్ ఆస్పత్రిలో లేనప్పుడు సిబ్బంది లేనిపోని సాకులు చెప్పేస్తున్నారని ఆరోపిస్తున్నారు. డాక్టర్‌కు ఫోన్ చేసి వారి డైరెక్షన్‌లో బిడ్డ అడ్డం తిరిగిందని, ఉమ్మనీరు తాగిందని, బీపీ, షుగర్ లెవల్ పెరిగిందని, బ్లడ్ లేదు, బెడ్లు లేవు, హైరిస్క్, ఇక్కడుంటే గర్భిణి ప్రాణానికే ప్రమాదమని భయపెట్టి తరిమేస్తున్నారని వాపోతున్నారు.

రెఫర్ కేసులపై విచారణ



ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలన్నదే లక్ష్యం. ప్రసవ కేసులపై అలసత్వం వహిస్తే సహించే ప్రసక్తే లేదు. ఎవరినైనా వేరే ఆస్పత్రికి రెఫర్ చేస్తే, వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తాం. బుధవారం రాత్రి జరిగిన ఘటనపై కూడా దర్యాప్తు చేయిస్తాం. ఎవరైనా ఆస్పత్రిలో ఇబ్బంది పెడితే బాధితులు నేరుగా మాకు ఫిర్యాదు చేయండి. రోగులతో దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– టీఎస్‌కే నాయక్, డీసీహెచ్ఎస్, చిత్తూరు

దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా మందలింపులతో సరిపెట్టేస్తున్నారని విమర్శిస్తున్నారు.

యథేచ్ఛగా వసూళ్లు!

ప్రసవానికి వచ్చే వారి నుంచి ఆ విభాగంలో కొందరు డ్యూటీ సిబ్బంది నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వివిధ పరీక్షల పేరుతో కాసులు గుంజేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్యూటీ సిబ్బంది టీ, కాఫీ ఖర్చులకు కావాలని డబ్బులు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో డెలివరీకి రూ. వెయ్యి నుంచి రూ. 2 వేల వరకు పిండుకుంటున్నారని, పక్క రాష్ట్రాల నుంచి వచ్చే వారి దగ్గర రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం.

మంత్రి పెద్దిరెడ్డితో న్యాయవాదుల భేటీ



న్యాయవాదులను సత్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి. చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పుంగనూరు : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం తిరుపతిలో పుంగనూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు, కార్యదర్శి ఆనంద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యవర్గ సభ్యులను మంత్రి పెద్దిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, న్యాయవాదులు మల్లికార్జునరెడ్డి, ఆకుల చెన్నకేశవులు, సుధాకర్‌రెడ్డి, అంజిబాబు, సమీవుల్లా, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పేదల గొంతు కోసిన చంద్రబాబు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : ఇంటి నిర్మాణాల పేరుతో చంద్రబాబు నిర్దాక్షిణ్యంగా పేదల గొంతు కోశారని, ఆయనకు ఓటు అడిగే అర్హతే లేదని డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపడ్డారు. శనివారం బిల్లుదొన్న గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ హయాంలో పక్కాగృహాల కట్టిస్తామని కేవలం ఒక్క రూపాయి ఖాతాల్లో వేసి చేతులుదులుపుకున్నారని విమర్శించారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఎస్సీ,ఎస్టీ కాలనీలకు రోడ్లు కూడా వేయలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన మూడేళ్లలోనే అన్ని గ్రామాలకు రోడ్లు వేయించి, బస్సు సౌకర్యం కల్పించారని వెల్లడించారు. ఒక్కరూపాయి బిల్లుతో ఆగిపోయిన ప్రతి ఇంటికీ రూ.1.5లక్షలు మంజూరు చేశారని తెలిపారు. చంద్రబాబుకు తన సామాజికవర్గం కోసమే పనిచేశారని, జగనన్న కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. పేదలు సంతోషంగా ఉంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, రామోజీరావు, రాధాకృష్ణ, ఎల్లోమీడియాలు జీర్ణించుకోలేక విషప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ప్రజలే గుణపాఠం నేర్పుతారని స్పష్టం చేశారు. ఎంపీపీ లత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణయ్య, చందు రాజు, కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, వెంకటరత్నం పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌లో శిక్షణకు దరఖాస్తులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు ఎస్‌ఎస్‌సీ ఉత్తీర్ణులు, ఏదైనా డిగ్రీ పొందిన వారు అర్హులని తెలిపారు. సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్ శిక్షణకు ఎస్‌ఎస్‌సీ పాస్ లేక ఫెయిల్ అయిన వారు అర్హులని వివరించారు. ఆసక్తిగల వారు సోమవారంలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 63009 54441 నంబర్‌లో సంప్రదించాలన్నారు. శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్ తోపాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.

డీఎల్‌ఈడీ ఫలితాలు విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : డీఎల్‌ఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదలైనట్లు డీఈఓ విజయేంద్రరావు శనివారం తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు www.bre.ap.in వెబ్‌సైట్‌లో మార్కుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

నీటి పొదుపు తప్పనిసరి

చిత్తూరు అగ్రికల్చర్: నీటి వనరులను పరిమితంగా వినియోగించుకోవాలని భూగర్భ జల శాఖ అధికారి గోవర్దన్‌రెడ్డి, ఉద్యానవన శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక జలవనరుల శాఖ కార్యాలయంలో నీటి వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు తక్కువ నీటితో పండే పటలు సాగు చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. భూగర్భ జలాల సక్రమ వినియోగం కోసం ప్రతి రైతు తమ బోరుబావుల వివరాలను తహసీల్దారు కార్యాలయాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

వినోద.. విజ్ఞాన సమ్మేళనం



పాట పాడుతున్న నికితా గాంధీ

- మిన్నంటిన ఐఐటీ తిరుత్సవ–2023
- ఉర్రూతలూగించిన సింగర్ నిఖితా గాంధీ గీతాలాపన
- నేటితో ముగియనున్న టెక్నో కల్చరల్ ఫెస్ట్

రేణిగుంట, ఏర్పేడు: తిరుపతి ఐఐటీలో తిరుత్సవ సంబరాలు మిన్నంటాయి. రెండో రోజు శనివారం ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ పర్యవేక్షణలో విద్యార్థులు తిరుత్సవ సంబరాలు నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పలు ఈవెంట్లలో పాల్గొన్నారు.

హుషారెత్తించిన నిఖితా గాంధీ గీతాలాపన

ప్రఖ్యాత సింగర్ నిఖిత గాంధీ బృందం శనివారం రాత్రి ప్రదర్శించిన గీతాలాపన హుషారెత్తించే రీతిలో ఉత్సాహంగా సాగింది. ఆమె పాడిన బాలీవుడ్ సినీ గీతాలు వీక్షకులను ఉర్రూతలూగించాయి. హుషారైన పాటలతో నిర్వహించిన మ్యూజికల్ నైట్‌లో స్టేజ్ ముందు ఐఐటీ విద్యార్థులే కాకుండా బయట నుంచి వచ్చిన వారు నృత్యాలు చేస్తూ కేరింతలతో ఈవెంట్‌ను ఆస్వాదించారు. ఆమె పాడుతుంటే విద్యార్థులంతా చప్పట్లుకొడుతూ గొంతు కలిపారు. వేదిక ప్రాంగణమంతా విద్యుత్ వెలుగుల జిలుగులు, హుషారైన మ్యూజికల్ శబ్దాలు శ్రోతలను ఆకట్టుకున్నాయి.

తిరుత్సవ్–2023లో నేడు

తిరుత్సవ్–2023 సంబరాల్లో చివరి రోజు ఆదివారం ఏస్ ఆఫ్ బార్డర్ ల్యాండ్ ఫైనల్స్, కేబీసీ షో, సరికొత్త ఆవిష్కరణల ఈవెంట్ ఐడియాథాన్, జనరల్ క్విజ్, స్పిన్ ఏ యార్న్, కేటీఎం బైక్ షో, రాత్రి డాక్టర్ కన్నన్ మెంటర్ షో, తిరుత్సవ్ ముగింపు సమావేశం, రాత్రి 8 గంటలకు ప్రముఖ పాప్ సింగర్ నైనా సూర్తె బృందం డీజే నైట్‌తో ఉత్సవాలు ముగుస్తాయి.



ఉత్సాహంగా వీక్షిస్తున్న విద్యార్థినీవిద్యార్థులు

ఆర్టీసీ ఆదాయంలో తిరుపతి జిల్లా ఫస్ట్

- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.565 కోట్లు
- గత ఏడాది రూ.277.88 కోట్లు

తిరుపతి అర్బన్: ఏపీఎస్‌ఆర్టీసీకి జిల్లాల వారీగా లభించిన ఆదాయంలో తిరుపతి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని అధికారులు తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం (2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు) ఆర్టీసీ తిరుపతి జిల్లా ఆదాయం రూ.565 కోట్లుగా అధికారులు వెల్లడించారు. 2020–21లో కోవిడ్‌తో పెద్ద ఎత్తున ఆర్టీసీకి నష్టాలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత ఆర్టీసీ ఆదాయంతో ముందుకు సాగుతోంది. కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో 11 డిపోలున్నాయి. గత ఏడాది 844 లక్షల కిలోమీటర్ల ఆర్టీసీ సర్వీసులు నడిపించారు. రూ.277.88కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 1208 లక్షల కిలోమీటర్లు ఆర్టీసీ సర్వీసులు తిప్పారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఆదాయం రెట్టింపయ్యింది.

కిరాతకంగా భార్యను చంపిన భర్త

- కత్తితో విచక్షణారహితంగా నరికివేత
- హతురాలు ప్రైవేట్ టీచర్
- నిందితుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు

చిత్తూరు అర్బన్: నగరంలోని కొంగారెడ్డిపల్లె విద్యానగర్‌లో శనివారం ఉదయం కట్టుకున్న భార్యను ఓ భర్త అత్యంత కిరాతకంగా హత్యచేశాడు. వివరాలు.. పుత్తూరుకు చెందిన ఢిల్లీరాజు (48) అలియాస్ ఢిల్లీబాబుకు నగరికి చెందిన హేమలత (43)కు 2000లో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు. పెద్దకొడుకు బీటెక్ పూర్తిచేసి బెంగళూరులో పనిచేస్తున్నాడు. మిగిలిన ఇద్దరు కవలలూ ఇంటర్ సెకెండియర్ పరీక్షలు ఈ ఏడాది రాశారు. అయితే ఢిల్లీరాజుకు ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉండడంతో హేమలత దాదాపు పదేళ్లుగా భర్తతో మాట్లాడడం లేదు. ప్రస్తుతం ఢిల్లీరాజు ఎస్ఆర్‌పురంలోని పుల్లూరు జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. హేమలత చిత్తూరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. అయితే వారు నేరుగా మాట్లాడుకోక పోయినా నిత్యం గొడవలు పడుతుండేవారు. పిల్లలు మాత్రం త్వరలోనే వేరుగా వెళ్లిపోదామని తల్లికి సర్దిచెబుతూ ఉండేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కూడా భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. శనివారం ఉదయం పెద్దకుమారుడు తిరుపతి వెళ్లాడు. మరో కొడుకు ఆడుకునేందుకు బయటకు వెళ్లిపోయాడు. ఇదే అదనుగా భావించిన ఢిలీరాజు ఇంకో కొడుకుని బెడ్‌రూమ్‌లోకి నెట్టేసి గదికి తాళం పెట్టేశాడు. అప్పుడే స్నానం చేసి బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చిన భార్యపై విచక్షణారహితంగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. తల, మెడ, గొంతుపై నరికేశాడు. దీంతో కేకలు వేస్తూ హేమలత కుప్ప కూలిపోగా.. కుమారుడు తన స్నేహితులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వాళ్లు వచ్చి సుత్తితో తాళం పగలగొట్టి చూడగా హేమలత హృదయవిదారకస్థితిలో చనిపోయి కనిపించింది. నిందితుడు హత్యాయుధంతోపాటు


హేమలత (ఫైల్) నిందితుడు ఢిల్లీరాజు

ద్విచక్రవాహనంలో పరారయ్యాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి, వన్‌టౌన్ సీఐ నరసింహరాజు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ బృందం ఆధారాలను సేకరించారు. అనంతరం మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంత్యక్రియలు నిమిత్తం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపినట్లు సీఐ తెలిపారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.56,300
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,600

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.74

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	36	24
తిరుపతి	37	25
తిరుమల	32	21
గూడూరు	37	27
నగరి	37	26

పారా లీగల్ వలంటీర్లకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

చిత్తూరు అర్బన్ : నగరంలోని జిల్లా కోర్టు న్యాయసేవా సదన్‌లో శనివారం పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమారావు మాట్లాడుతూ ప్రజలకు, న్యాయ వ్యవస్థకు వారధిలా వలంటీర్లు పనిచేయాలని సూచించారు. గ్రామీణులకు ఉచితంగా న్యాయసేవలు అందేలా చూడాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇందులో లా విద్యార్థులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను భాగస్వాములు చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో 8వ అదనపు జిల్లా జడ్జి ఎస్. శ్రీదేవి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ. శ్రీనివాస్ మూర్తి, స్పెషల్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ కె. రవి పాల్గొన్నారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్: జాతీయ లోక్ అదాలత్‌ను మే 13వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ, కక్షిదారులు న్యాయవాదుల సహకారంతో అదాలత్‌ను విజయవంతంగా నిర్వంచనున్నట్లు వెల్లడించారు.

డైట్‌లో రక్తదాన శిబిరం


ప్రిన్సిపల్ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

కార్వేటినగరం : జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ఆవరణలో శనివారం రెడ్‌క్రాస్ వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ ప్రభాకర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రెడ్‌క్రాస్‌జిల్లా కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ 20 ఏళ్ల తర్వాత డైట్‌లో రక్తదానం శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. రక్తదానం చేసిన వారికి గవర్నర్ సంతకంతో ప్రశంసా పత్రం అందించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ప్రిన్సిపల్‌ను రెడ్‌క్రాస్ వారు సత్కరించారు.

శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రెండు గంటల ఆలస్యం


చిత్తూరు సమీపంలో ఆగిపోయిన శేషాద్రి ఎక్స్‌ప్రెస్

చిత్తూరు అర్బన్: కాకినాడ టౌన్ నుంచి బెంగళూరు వెళ్లే శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం సాంకేతికలోపం నెలకొనడంతో రెండు గంటలు ఆలస్యంగా నడిచింది. ఉదయం 7.15 గంటల ప్రాంతంలో చిత్తూరు స్టేషన్‌లో ఆగిన రైలు.. ఇక్కడి నుంచి బయలుదేరి కొద్ది దూరం వెళ్లగా మూడో గేటు వద్ద ఆగిపోయింది. దాదాపు అరగంట ఇక్కడే ఆపేసిన పైలెట్ ఇంజిన్‌ను పరిశీలించగా సాంకేతిక సమస్య ఉన్నట్లు గుర్తించారు. పక్కనే ఉన్న సిద్దంపల్లె స్టేషన్ వరకు రైలును పోనిచ్చి ఆపై అక్కడే ఆపేశారు. అనంతరం తిరుపతి నుంచి నుంచి మరో లోకోను తెప్పించి ఉదయం 9.30 గంటల ప్రాంతంలో రైలు సిద్దంపల్లె నుంచి బయలుదేరి వెళ్లింది. దీని ఫలితంగా పలు రైళ్లు ఇటువైపు ఆలస్యంగా నడిచాయి.

రెండు ద్విచక్రవాహనాల దహనం


కాలిపోయిన వాహనాలు

నగరి : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ వీధికి చెందిన సుధాకర్, శోభ తమ ఇంటి ముందు నిలిపి ఉంచిన రెండు ద్విచక్రవాహనాలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. సుధాకర్ అందించిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తు తెలియని వ్యక్తి ఇంటి ముందు ఉన్న వాహనాలపై పెట్రోలు పోసి తగలబెట్టినట్లు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధ్యాపకుడిపై పోక్సో కేసు

గంగవరం : ప్రేమ పేరుతో మైనర్ బాలికను వెంట తీసుకెళ్లిన అధ్యాపకుడిపై పోలీసులు శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు మండలంలోని బొమ్మనపల్లెకు చెందిన చలపతి ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. అదే కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని ప్రేమిస్తున్నానని నమ్మించి తనతో తీసుకెళ్లిపోయాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్నికి ఆహుతైన నీలగిరి తోట


మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

పుంగనూరు : మండలంలోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో వై.నారాయణ రెడ్డికి చెందిన నీలగిరితోట శనివారం సాయంత్రం చెలరేగిన మంటలకు దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో మంటలను అదుపు చేశారు. అప్పటికే చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు బీడీ కాల్చి వేయడంతో ప్రమాదం జరిగి ఉంటుందని చెట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు. ఆయన వెంట సిబ్బంది సుమన్, లోకేష్‌రెడ్డి, వెంకటరమణ ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్


తహసీల్దార్ కార్యాలయం వద్ద ట్రాక్టర్లు

నగరి : మండలంలోని మేళపట్టు సమీపంలో కుశస్థలి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సీజ్ చేశారు. శనివారం స్థానికులు అందించిన ఫిర్యాదు మేరకు ఆయన నదీ తీరానికి వెళ్లి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరుచోట్ల కర్ణాటక మద్యం పట్టివేత



చిత్తూరు, పుంగనూరులో స్వాధీనం చేసుకున్న మద్యంతోపాటు నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నగరంలోని పాత పోలీసు కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ నరసింహరాజు వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారంతో రెడ్డిగుంట వద్ద తనిఖీలు చేపట్టామన్నారు. ఓ సుమో ఆగకుండా ముందుకు వెళ్లడంతో వెంబడించి పట్టుకుని పరిశీలించగా అందులో 45 బాక్సుల్లో ఉన్న 4,320 టెట్రా ప్యాకెట్లు, ఓ బాక్సు క్వార్టర్ బాటిళ్లు పట్టుబడినట్లు వివరించారు. చిత్తూరు గంగాకాలనీకు చెందిన ఎస్.ఓంమూర్తి (32), తేనెబండకు చెందిన కె.కన్నన్‌ను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కారుతో సహా సీజ్ చేసిన మద్యం విలువ సుమారు రూ.10.20 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని చెప్పారు. తనిఖీల్లో పాల్గొన్న ఎస్ఐలు రమేష్, ప్రసాద్, ఏఎస్ఐ ఉమామహేశ్వర్ తదితరులను డీ ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

పుంగనూరు : కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన సయ్యద్ ముష్రాఫ్‌అలీ, జునాద్ ఆటోలో మద్యం తీసుకెళుతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి రూ.30వేల విలువైన 670 టెట్రా ప్యాకెట్లు, 9 బ్రాందీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దాడిలో ఎస్ఐ అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి కంటైనర్ దగ్ధం

- డ్రైవర్ మృతి

రామకుప్పం: మండలంలోని కొంగనపల్లె పంచాయతీ వెంకటాపురం వద్ద శనివారం విద్యుత్ తీగలు తగలడంతో ఓ కంటైనర్ దగ్ధమైంది. ఈ ప్రమాదంలో వాహన డ్రైవర్ మృతిచెందాడు. వివరాలు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ ఫయాజ్‌ఖాన్(58) కంటైనర్‌లో మహారాష్ట్ర నుంచి కోడిగుడ్ల లోడ్ తీసుకుని వి.కోట మండలం ఎల్లాగరం సమీపంలోని కోళ్లఫారమ్‌కు వస్తుండగా ప్రమాదశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు వాహనానికి తగిలాయి. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. డ్రైవర్ ప్రాణాలు దక్కించుకోవడానికి కిందకు దూకేసినా.. అప్పటికే మంటలు అంటుకోవడంతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. కంటైనర్ యజమాని లంబోదర సాహో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించామని వెల్లడించారు.


కాలిపోయిన కంటైనర్

